నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | సోమవారం 21 అక్టోబర్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD




కోటపల్లి : మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

# రైతు భరోసా కోసం రణం

● మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో బీఆర్ఎస్ పోరుబాట ● వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు కదిలిన శ్రేణులు

● పలుచోట్ల రాస్తారోకోలు.. ధర్నాలు ● నినాదాల హోరు ● హామీలు నెరవేర్చని సర్కారు గద్దె దిగాలని డిమాండ్ ● సర్కారు దిష్టిబొమ్మల దహనం



మంచిర్యాల టౌన్ : రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్ రావు, నాయకులు



ఆసిఫాబాద్ టౌన్ : అంబేద్కర్ చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు



తాండూర్ : ఐబీలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న రైతులు, బీఆర్ఎస్ నాయకులు



కాసిపేట : కొండాపూర్ యాపా చౌరస్తాలో ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య, బీఆర్ఎస్ నాయకులు

*కాంగ్రెస్ సర్కారుపై బీఆర్ఎస్ కన్నెర్రజేసింది. రైతు సంక్షేమమే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వంలో విజయవంతంగా అమలు చేసిన రైతు భరోసా(రైతు బంధు)ను ఎగ్గొట్టడంపై పోరుబాట పట్టింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు ఆదివారం మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో రాస్తారోకోలు, ధర్నాలు చేసింది. రేవంత్ సర్కారు దిష్టిబొమ్మలను దహనం చేసి.. వ్యతిరేక నినాదాలతో హోరెత్తించింది. ఎకరాకు రూ. 15 వేలు ఇస్తామని హామీ ఇచ్చి.. మాట మార్చడంపై మండిపడింది. వెంటనే నిధులు విడుదల చేసి రైతుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేసింది.*

- కుమ్రం భీం ఆసిఫాబాద్, అక్టోబర్ 20 (నమస్తే తెలంగాణ ):

**నమస్తే బృందం:** మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దివాకర్‌రావు మాట్లాడుతూ ఆచరణ సాధ్యంకాని హామీలిచ్చి మోసం చేసిన కాంగ్రెస్ వెంటనే గద్దె దిగాలని డిమాండ్ చేశారు. బెల్లంపల్లి పట్టణంలోని పోచమ్మ చెరువు రోడ్డు వద్ద మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం, రేవంత్‌రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాసిపేట మండలం కొండాపూర్ యాపా చౌరస్తాలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే చిన్నయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులను మోసం చేసిందని, పంట కోతకు వస్తున్నా రైతు భరోసా ఇవ్వలేదని మండిపడ్డారు. చెన్నూర్ పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం ఎదుట బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించగా, పోలీసులు అడ్డుకున్నారు. తాండూర్ ఐబీలో రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు ధర్నా చేపట్టి, జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. రహదారి దిగ్బంధం చేశారు. రైతు భరోసా ఎత్తివేసే కుట్రలో భాగంగానే ఈ సీజన్ నుంచే కాంగ్రెస్ ఎగనామం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు ధర్నా చేస్తున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. కోటపల్లిలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. అనంతరం తెలంగాణ చౌక్‌లో మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు దిష్టిబొమ్మను దహనం చేశారు. జన్నారం మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు బైఠాయించి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. లక్షెట్టిపేట పట్టణంలోని ఊత్కూర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. నెన్నెల మండలంలో బీఆర్ఎస్ శ్రేణుల ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. వేమనపల్లి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు కోలి వేణుమాధవ్‌రావు ఆధ్వర్యంలో నాయకులు ధర్నా చేపట్టారు.



కాగజ్ నగర్ : పట్టణంలోని ప్రధాన రహదారిపై ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కెరమెరి : మండల కేంద్రంలో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

### ఆసిఫాబాద్ జిల్లాలో..

కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కోవ లక్ష్మి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం మోసగిస్తున్న తీరు రైతులకు అర్థమవుతోందని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెబుతారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చేదాకా బీఆర్ఎస్ ఆందోళనలు చేపడుతుందని, కాంగ్రెస్ మెడలు వంచి రైతులకు న్యాయం చేస్తామన్నారు. కెరమెరి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కాంగ్రెస్ విఫలమైందని మండిపడ్డారు. వాంకిడి మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. తిర్యాణి మండల కేంద్రంలోని కుమ్రం భీం చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. రెబ్బెన మండల కేంద్రంలోని అంతర్రాష్ట్ర రహదారిపై బీఆర్ఎస్ నాయకులు నిరసన చేపట్టారు. కాగజ్‌నగర్ పట్టణంలో ఎన్టీఆర్ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా చేసి సర్కారుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.



ముక్కుకు గాయమైతే తలకు పట్టి కట్టుకున్న వ్యక్తి ఫొటోను చూపుతున్న మాజీ ఎంపీపీ స్వర్ణలత



గాయాలైనట్లు చెబుతున్న వారు హాస్పిటల్‌లో ఉన్న ఫొటోలు చూపుతూ..

# ముక్కుకు గాయమైతే తలకు కట్టు ఎలా..?

● కాలు, చేయి విరిగిన వాళ్లు అప్పుడే బైక్ ఎలా నడిపారు?

● దెబ్బలు తగిలిన తనభర్తపైనే తప్పుడు కేసులు పెట్టారు

● మాజీ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత ఆవేదన

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 20 : తన భర్త, మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై దాడి చేసిన వ్యక్తులపై కాకుండా తిరిగి ఆయనపైనే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించారని మాజీ ఎంపీపీ మందపల్లి స్వర్ణలత ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం మంచిర్యాలలో మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావుతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. రాపల్లి గ్రామంలో తన కూతురును కారులో తీసుకెళ్తుండగా, డోరు సరిగా పడలేదని, కారును ఆపి డోరు తీసి వేస్తున్న క్రమంలో బైక్‌పై వచ్చిన ఇద్దరు ఆ డోర్ తగిలి కిందపడ్డారని, అప్పుడే వారిని దవాఖానకు తీసుకెళ్లి చికిత్స చేయిస్తామని చెప్పారని, అందుకు వారు నిరాకరించారని తెలిపారు. బైక్‌పై నుంచి కిందపడిన ఇద్దరు వ్యక్తులతో పాటు మరో ఇద్దరు కలిసి తన భర్తపై ఇనుపరాడ్‌లతో దాడికి దిగారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రగాయాలతో మంచిర్యాలలోని ప్రైవేట్ హాస్పిటల్‌కు వస్తే పోలీసులు దౌర్జన్యంగా ఆయనను లాక్కెళ్లారని, ప్రభుత్వ దవాఖానకు తీసుకెళ్తున్నామని చెప్పి ఎక్కడెక్కడో తిప్పి తీసుకువచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త దాడి చేశాడని చెబుతున్న వారిలో ఓ వ్యక్తికి ముక్కుకు దెబ్బ తగిలితే అతని తలకు కట్టు కట్టుకున్నాడని, కాలు, చేయి విరిగిందని చెబుతున్న ఇద్దరు వ్యక్తులు అదే సమయంలో బైక్‌పై పోలీస్‌స్టేషన్‌కు ఎలా వెళ్లారని ప్రశ్నించారు. దెబ్బలు తగిలితే ముందుగా హాస్పిటల్ వెళ్లకుండా పోలీస్ స్టేషన్‌కు చేరడం ఏమిటని ప్రశ్నించారు. కావాలనే నాటకాలు ఆడుతున్నారని, తప్పుడు కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేయడమే లక్ష్యంగా కొంతమంది వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తనభర్తకు ఏమైనా జరిగితే పోలీసులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

# యువత చెడిపోవడానికి ప్రధాన కారకుడు పీఎస్సారే

● ఆయన అనుచరులే గంజాయి బ్యాచ్‌లను నడిపిస్తున్నారు ● బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెడుతున్నారు

● పోలీసుల వైఖరిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తం ● అధికారం ఎవ్వరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలి ● మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్, అక్టోబర్ 20 : యువతను గంజాయికి బానిసలుగా చేసి, వారు చెడిపోవడానికి ప్రధాన కారకుడు స్థానిక ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావేనని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. ఆదివారం మంచిర్యాలలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన బీఆర్ఎస్ నాయకులతో కలిసి మాట్లాడారు. 'ఎమ్మెల్యే పీఎస్సార్ అనుచరులు గంజాయి బ్యాచ్‌లను నడిపిస్తున్నారని, యువతకు గంజాయిని బానిసలుగా చేసి వారిచేత అలజడి సృష్టించి సెటిల్‌మెంట్‌లు చేసుకుంటూ డబ్బులు సంపాదిస్తున్నారని, అందులో ఎమ్మెల్యేకూ వాటా ఉందని ఆరోపించారు. ఇప్పటికే చాలామంది బీఆర్ఎస్ నాయకులపై తప్పుడు కేసులు పెట్టారని, ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తాజాగా మాజీ వైస్ ఎంపీపీ మందపల్లి శ్రీనివాస్‌పై కూడా తప్పుడు కేసులు పెట్టారని పేర్కొన్నారు. తనపై, తన కుమారుడు విజిత్ పైనా తప్పుడు కేసులు పెట్టాలని తహతహలాడుతున్నారని, అయితే తాము కేసులకు భయపడమని, ఎప్పటికైనా నిజమే గెలుస్తుందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు అనుసరిస్తున్న తీరును ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ప్రభుత్వ భవనాన్ని కూలగొట్టిన మట్టిని ప్రైవేట్ వెంచర్‌లో పోస్తుంటే ఫొటోలు తీస్తున్న విలేకరిపై దాడి చేసింది గంజాయి బ్యాచ్ కాదా అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే మాటలు ప్రజలు ముక్కున వేలేసుకొని ఆశ్చర్యపోయేలా ఉన్నాయని, తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు, పీఎస్సార్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు ఏం జరుగుతుందో ప్రజలను అడిగితే చెబుతారని అన్నారు. అభివృద్ధి విషయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎల్లంపల్లి ప్రాజెక్టు, గూడెం లిఫ్ట్, మెడికల్‌కాలేజీ, రహదారుల విషయంలో ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో సగం జిల్లాలకు ఎల్లంపల్లి నీళ్లు అందుతున్నాయని అన్నారు. మెడికల్ కాలేజీ హాస్పిటల్ 400 పడకల సామర్థ్యం ఉంటుందని, అక్కడ ఉచితంగా చికిత్సలు అందిస్తారని తెలిపారు. ఎమ్మెల్యే అయ్యాక ఏవైనా కొత్త ప్రాజెక్టులు తెస్తే స్వాగతిస్తాం.. కానీ ఉన్న వాటిని వ్యతిరేకించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మంచిర్యాల అంతర్గాం బ్రిడ్జిని ఎందుకు వద్దంటున్నాడో ప్రజలకు వివరించాలని అన్నారు. ఎవరు సెటిల్‌మెంట్‌లకు పాల్పడ్డ వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అసలు గంజాయికి ప్రధాన కారకుడు పీఎస్సారేనని, కానీ ఆయనే ఇతరులపై బురదజల్లుతున్నాడని చెప్పారు. హైదరాబాద్‌లోని కాప్రాలో 20మంది గూండాలతో ప్లాట్ల యజమానులపై దాడి చేయించారని, వారందరికీ గంజాయిని సరఫరా చేసిది పీఎస్సారే అని అన్నారు. ఇతని ఆగడాలపై గాంధీభవన్, సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షుడు, మంత్రి తుమ్మలకు ఫిర్యాదులు చేశారని గుర్తుకు చేశారు. విజిత్ పేరును మాటిమాటికీ జపిస్తున్నాడని, విజ్జు అని ఎంతో ప్రేమగా పిలిచిన సంగతి మరిచావా అని ప్రశ్నించారు. భూదాన్ భూమి 24 ఎకరాలు, మార్కెట్ కమిటీ స్థలం కాపాడామని, మాకు డబ్బులే కావాలంటే ఇవన్నీ చేసేవాళ్లమా అని అన్నారు. అబద్ధాలతోనే కాలాన్ని గడుపుతున్నావని, పైగా ధర్మం, అధర్మానికి పోరాటం అని మాట్లాడడం విచిత్రంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇక్కడ కాదు హైదరాబాద్‌లో మనిద్దరి పేరు తీస్తే ఎవరు ఏం చెబుతారో తెలుస్తుందని, దయ్యాలు వేదాలు పలికినట్లు ఆయన మాటలు ఉన్నాయన్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదని గుర్తుంచుకోవాలని, ఏపీ ప్రజలు జగన్ ప్రభుత్వాన్ని కూలదోశారని, ఇక్కడి కాంగ్రెస్ సర్కారుకూ అదే గతి పడుతుందన్నారు. 324 సర్వేనంబర్‌లో పెద్ద కుంభకోణం జరిగిందని పీఎస్సార్‌చెప్పారని, ఇప్పుడు వారి ప్రభుత్వమే ఉందని, మొత్తం 57 ఎకరాలు వెలికితీయాలని డిమాండ్ చేశారు. లేకుంటే నీకు అందులో వాటా ఉన్నట్లు భావించాల్సి ఉంటుందన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు పెంట రాజయ్య, ఈసంపల్లి ప్రభాకర్, బీఆర్ఎస్ యూత్ నాయకులు నడిపెల్లి విజిత్‌రావు, మాజీ ఎంపిపి స్వర్ణలత, నాయకులు గోగుల రవీందర్‌రెడ్డి, గాదెసత్యం, అంకం నరేశ్, తాజుద్దీన్, సుంకరి రమేశ్, పడాల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.



రైలు ఢీ కొట్టడంతో రైల్వే ట్రాక్‌పై చెల్లాచెదురుగా పడిఉన్న గొర్రెలు

# దేవుడా ఎంతపనాయే..

● రైలు ఢీకొని 200కు పైగా గొర్రెలు మృతి

● బతికేదెలా అంటూ విలపించిన యజమాని

● సర్కారు ఆదుకోవాలని వేడుకోలు

సిర్పూర్(టీ), అక్టోబర్ 20 : ఆ కటుంబానికి జీవనాధారమైన గొర్రెలు రైలు ఢీకొని మృతి చెందగా, 'దేవుడా ఎంతపనాయే'.. అంటూ యజమాని గుండెలవిసేలా రోదించాడు. ఈ ఘటన ఆదివారం తెల్లవారు జామున సిర్పూర్(టీ) మండలం ఆరెగూడ ఆటవీప్రాంతంలో జరిగింది. కౌటాల మండలం శీర్షా గ్రామానికి చెందిన జడ భీమయ్యకు 250 గొర్రెలు-మేకలు ఉన్నాయి. వాటిని మేపుకుంటూ శనివారం సాయంత్రం సిర్పూర్(టీ) మండలం ఆరెగూడ అటవీ ప్రాంతానికి చేరుకున్నాడు. తెల్లవారు జామున 5 గంటల ప్రాంతంలో గొర్రెల మంద ఒక్కసారిగా రైలు పట్టాలపైకి వచ్చింది. అదే సమయంలో గుర్తుతెలియని రైలు మందపై నుంచి వెళ్లింది. దాదాపు 200కి పైగా గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. రైలు పట్టాలపై చెల్లాచెదురుగా పడి ఉన్న గొర్రెలను చూసిన భీమయ్య కన్నీరుమున్నీరయ్యాడు. సుమారు రూ. 16 లక్షలకుపైగా నష్టం వాటిల్లిందని, సర్కారు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

# సలాం..పోలీస్

● రక్షణలో నేస్తం.. ఆపదలో సమస్తం ● విధి నిర్వహణలో ప్రాణాలర్పిస్తున్న పోలీసులు

**నేడు అమర వీరుల సంస్మరణ దినం**

చెన్నూర్ టౌన్, అక్టోబర్ 20 : పోలీస్.. ఈ పదమే గంభీరం. తెగువకు.. త్యాగానికి పర్యాయం.. ప్రపంచమంతా నిద్రలో ఉంటే పోలీసులు మాత్రం మేల్కొని, కాపలా కాస్తుంటారు. శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా ఎందరో ప్రాణ త్యాగాలు చేయగా, వారిని స్మరించుకునే రోజు వచ్చింది. సోమవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనుండగా, అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై వీరుల సేవలను గుర్తు చేసుకొని.. నివాళులర్పించనున్నారు.

### రక్తదాన శిబిరాలు..

పోలీసుల విధి నిర్వహణ అత్యంత శ్రమతో కూడుకున్నది. ఇతర ఉద్యోగుల్లా కొన్ని గంటలకు పరిమితమైనది కాదు. ఎండా.. వాన, పగలూ.. రాత్రి అనే తేడా లేకుండా విధులు నిర్వహిస్తుంటారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించుకోలేం. సంపన్నుడు మొదలు.. సామాన్యుడి వరకు ప్రతి ఒక్కరూ ప్రతి అవసరానికీ సాయం కోరేది పోలీసులనే. దండెత్తి వచ్చే శత్రువుల నుంచి దేశాన్ని కాపాడేవారు సైనిక జవానులైతే.. అంతర్గత శత్రువుల నుంచి ప్రజలను కాపాడి, భద్రతకు భరోసా ఇచ్చేది, సామాజిక ఆస్తులను రక్షించేది పోలీసులే. సంఘ విద్రోహ శక్తులతో పోరాడి విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను స్మరించుకునేందుకు నేడు సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నారు. అమరులైన పోలీసులకు నివాళులర్పించడం, వారి త్యాగాలను గుర్తు చేస్తూ ర్యాలీలు, మెగా రక్తదాన శిబిరాలు నిర్వహించడంవంటి కార్యక్రమాలు చేపట్టనున్నారు.

### నాటి అమరవీరుల గాథ..

పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేం. వ్యవస్థ సాఫీగా నడవడంలో పోలీసులది కీలకపాత్ర. పోలీసుల అమరవీరులను స్మరించుకునే రోజుకు మహోన్నత చరిత్ర ఉంది. 1959, అక్టోబరు 21.. అంటే సరిగ్గా 62 ఏళ్ల కిందట 'భారత్ – టిబెట్' సరిహద్దుల్లో ఉన్న లడక్‌లోని ఆక్సాయ్‌చిన్ వద్ద భారత్‌కు చెందిన కేంద్ర రిజర్వు పోలీసులు (సీఆర్‌పీఎఫ్) సరిహద్దు రక్షణలో ఉన్నారు. విపరీతమైన చలిలో పది మంది సీఆర్‌పీఎఫ్ పోలీసులు విధులు నిర్వహిస్తుండగా, చైనా సైనికులు భారీ సంఖ్యలో మన దేశ సరిహద్దులోకి చొచ్చుకువచ్చారు. వారిని ఈ 10 మంది పోలీసులు ధైర్యంగా ఎదిరించారు. చివరి రక్తపు బొట్టు వరకు పోరాడి, దేశం కోసం అసువులు బాశారు. భారత దేశ రక్షణ కోసం పోలీసులు ప్రాణాలు వదిలిన తొలి సందర్భమది. ఇందుకు గాను అన్ని రాష్ట్రాల పోలీసు ఉన్నతాధికారులు 1960 జనవరి 9న సమావేశమయ్యారు. అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటించాలని తీర్మానించారు. అప్పటి నుంచి దేశ వ్యాప్తంగా అక్టోబరు 21న పోలీసు అమరవీరుల సంస్మరణ దినంగా పాటిస్తున్నారు. అమర పోలీసుల వీర త్యాగాన్ని స్మరించుకొని వారి కుటుంబాలకు సానుభూతిని, సహకారాన్ని ప్రకటించి వారికి ఘనమైన నివాళులర్పిస్తున్నారు.




